సాక్షి
మహబూబాబాద్

సోమవారం, 16, సెప్టెంబర్, 2024



మల్బరీ సాగుకు ప్రోత్సాహం

మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణ కోసం ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ప్రోత్సాహకాలు ప్రకటించింది.

- 8లో ▸



కాకతీయ కాల్వకు బుంగలు

ఆసియాలోనే అతిపెద్దదైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కాకతీయ కాల్వ వల్ల ప్రమాదం పొంచి ఉంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.9^0 / 22.2^0

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రిపూట మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

మహబూబాబాద్: మిలాద్–ఉన్–నబీ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టరేట్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున జిల్లా ప్రజలు ఇది గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

పాకాల ఏటి ప్రాంతం పరిశీలన



గార్ల: గణేష్ విగ్రహాల నిమజ్జనం నిర్వహించే గార్ల సమీపంలోని పాకాల ఏటి ప్రాంతాన్ని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఆదివారం సందర్శించారు. నిమజ్జనం సజావుగా నిర్వహించేందుకు పాకాల ఏటి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్సై జీనత్‌కుమార్‌ను ఆదేశించారు. ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ వెంట గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి కిషన్, సిబ్బంది ఉన్నారు.

జ్వరం నుంచి కోలుకుంటున్నా..

ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్


దోర్నకల్: కొద్ది రోజులుగా జ్వరంతో ఇబ్బందులు ఎదుర్కొని ప్రస్తుతం కోలుకుంటున్నానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలతో నియోజకవర్గంలో ఇబ్బందులు తలెత్తడంతో పలు గ్రామాల్లో పర్యటించి వర్షంలో తడవడంతో జ్వరం బారిన పడినట్లు తెలిపారు. చికిత్స తీసుకోవడంతో పాటు జాగ్రత్తలు పాటించడంతో ప్రస్తుతం కోలుకుంటున్నానని, నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు గురికావద్దని తెలిపారు. రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుని నియోజకవర్గంలో పర్యటిస్తానని ఆయన చెప్పారు.

ప్రణాళికతో అభివృద్ధి, సంక్షేమం



తొర్రూరు: నిధుల కొరత ఉన్నప్పటికీ, దానిని అధిగమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రణాళికతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఆదివారం ఎమ్మెల్యే దంపతులు రాజగోపాల్‌రెడ్డి–లక్ష్మి వచ్చారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి వారికి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బీఆర్ఎస్ భ్రష్టు పట్టిస్తుందన్నారు. శాసన సభ్యులుగా బాధ్యత కలిగిన వారు బజారులో పడి తన్నుకోవడం బాధాకరమన్నారు. అరెకపూడి గాంధీ మా పార్టీ కాదని బీఆర్ఎస్ నాయకులు చెప్పడం విడ్డూరమన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి బాగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రామసహాయం కిషోర్‌రెడ్డి, గంజి విజయ్‌పాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, హమ్యానాయక్, సోమ రాజశేఖర్, మేకల కుమార్, సదాకర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో పర్యాటకుల సందడి



వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధికసంఖ్యలో తరలివచ్చి రామప్ప రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయగా గైడ్లు ఆలయ విశిష్టత వివరించారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని పర్యాటకులు సరస్సు అందాలను తిలకించారు.

నేడు గణనాథుడి నిమజ్జనం

- మానుకోట మున్సిపాలిటీ పరిధి నిజాం చెరువు వద్ద ఏర్పాట్లు
- మొత్తం 265 గణపతి ప్రతిమలు
- సుమారు 200మంది సిబ్బందికి విధుల కేటాయింపు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, అధికారులు



నిజాం చెరువు వద్ద గణనాథుల నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

మహబూబాబాద్: నవరాత్రులు భక్తుల పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మానుకోట పట్టణ శివారు నిజాం చెరువు వద్ద ఏర్పాట్లు చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలో వినాయక విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయనున్నారు. కాగా 200మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు.

మున్సిపాలిటీలో 265 విగ్రహాలు..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 265 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయగా.. ఇందులో 12 గణపతి ప్రతిమలను ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం చేశారు. కాగా 253 గణనాథుల నిమజ్జనం కోసం నిజాం చెరువు వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. రెండు క్రేన్లను నిమజ్జనం కోసం ఏర్పాటు చేయగా అదనంగా రెండు జేసీబీలను కూడా అందుబాటులో ఉంచారు. ఒక క్రేన్‌కు మున్సిపాలిటీ డీఈ సీహెచ్ ఉపేందర్, మరో క్రేన్‌కు టీపీఓ సాయిరాంను ఇన్‌చార్జ్‌లుగా నియామకం చేశారు. మూడు సెట్లతో ఉన్న ఒక పడవను కూడా ఏర్పాటు చేశారు. విద్యుత్ లైట్లు, లైటింగ్‌తో పాటు టెంట్ ఇతర అన్ని ఏర్పాట్లు చేశారు. మెడికల్ క్యాంపుకోసం ప్రత్యేక టెంట్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఇద్దరికి మాత్రమే అనుమతి..

గణనాథుల నిమజ్జనం చేసే నిజాం చెరువు వద్దకు ఉత్సవ కమిటీ సభ్యుల్లో ఇద్దరికి మాత్రమే అనుమతి ఇస్తారు. మున్సిపల్ సిబ్బందినే నిమజ్జనం చేస్తారు. ఆ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆరుగురు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. విలీన గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను కూడా నిజాం చెరువులోనే నిమజ్జనం చేయాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ ముందస్తు సమాచారం ఇచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లోని చెరువుల్లో నీటి మట్టం పెరిగి ప్రమాదకరంగా మారడంతో నిమజ్జనం చేయవద్దని, నిజాం చెరువులోనే చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులకు తెలియజేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ఫారెస్ట్ ఆఫీస్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న ఆహ్వాన వేదిక

ఫారెస్ట్ సెంటర్‌లో ఆహ్వాన వేదిక


జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ ఆఫీస్ సెంటర్‌లో వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసేందుకు ఆహ్వాన వేదికను ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహాలను తాళ్లపూసపల్లి రోడ్డు, శనిగపురం రోడ్డు నుంచి మూడుకొట్ల సెంటర్, ఇందిరాగాంధీ సెంటర్, నెహ్రూ సెంటర్ మీదుగా ఆర్‌యూబీ సమీపం నుంచి ఆర్వోబీ మీదుగా ఇల్లెందు రోడ్డు నుంచి వైఎస్సార్ సెంటర్, ముకుందా థియేటర్ ముందు నుంచి మదర్ థెరిసా సెంటర్ వరకు శోభాయాత్ర నిర్వహిస్తారు. ఫారెస్ట్ ఆఫీస్ సెంటర్‌లో గణనాథులకు ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు నుంచి నిజాం చెరువు వరకు శోభాయాత్ర జరుగుతుంది. పాత బజార్‌లోని గణనాథులు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి నర్సంపేట రోడ్డు, బైపాస్‌రోడ్డు నుంచి వైఎస్సార్ సెంటర్, ముకుందా థియేటర్ నుంచి మదర్ థెరిసా సెంటర్, ఫారెస్ట్ ఆఫీస్ సెంటర్, అక్కడి నుంచి నిజాం చెరువు వరకు శోభాయాత్ర జరుగుతుంది.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నిజాం చెరువు వద్దణ గణేష్ నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో పర్యవేక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవ శోభాయాత్ర, నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం గణేష్ నిమజ్జనం పూర్తి చేసేందుకు సిబ్బంది వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్, డీఎస్పీ తిరుపతి, మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



మానుకోటలోని వినాయక నిమజ్జన రూట్ మ్యాప్

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో గణపతి నిమజ్జనం సందర్భంగా శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. ఈమేరకు ఎస్పీ ఆదివారం జిల్లా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు. డీజేలు వినియోగించవద్దని, బాణసంచా కాల్చొద్దన్నారు. విగ్రహాలను తీసుకువెళ్లే వాహనాలపై మద్యం మత్తులో ఉన్నవారిని అనుమతించొద్దని, ఈ విషయాన్ని ఉత్సవ కమిటీ నిర్వాహకులు దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. రెచ్చగొట్టే నినాదాలు చేయడం, మత స్థలాల దగ్గర ఊరేగింపులు ఆపడం వంటివి చేయవద్దన్నారు. ఊరేగింపు సమయంలో కరెంటు తీగలను గమనించి వాహనాన్ని నడపాలని, నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లేటప్పుడు రోడ్లను పూర్తిగా బ్లాక్ చేయకూడదన్నారు. ఆయా రూట్లలో విద్యుత్, ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల సమన్వయంతో నిమజ్జనోత్సవం సాఫీగా సాగేలా చర్యలు చేపట్టామని, గణేష్ నిమజ్జనం చేసేందుకు భద్రతాపరమైన పూర్తి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

రోడ్డు మరమ్మతు పూర్తి

- నిమజ్జనానికి తొలగిన అడ్డంకులు



మట్టిరోడ్డును పరిశీలిస్తున్న సీఐ సర్వయ్య, ఎస్సై సతీష్

కురవి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కురవి పెద్ద చెరువు కట్టపైకి వెళ్లేందుకు నిర్మించిన మట్టి రోడ్డు తెగిపోయిన విషయం తెలిసిందే. కాగా వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బందులు ఏర్పడడంతో గ్రామ పంచాయతీ అధికారులు రోడ్డు తెగిన చోట ఆదివారం రాత్రి మరమ్మతుల పూర్తి చేయించారు. పనులు పూర్తి కావడంతో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఆటంకాలు తొలిగిపోయాయి. పనులను జీపీ కార్యదర్శి విజయలక్ష్మి, మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై గండ్రాతి సతీష్ పరిశీలించారు.

రుద్రేశ్వరాలయంలో మహా పూర్ణాహుతి

హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరాలయంలో జరుగుతున్న ఉచ్ఛిష్ట గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం గణపతి హవనం, మహా పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. మూల మహాగణపతిని శ్రీసిద్ధి బుద్ధి గణపతిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు మణికంఠ శర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరిగింది. గత తొమ్మిదిరోజులుగా దేవాలయంలో నిర్వహించిన పేరిణి, కూచిపూడి, భరతనాట్యం సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభకనబర్చిన చిన్నారులకు ఆర్యవైశ్య జాతీయ నాయకులు గట్టు మహేశ్‌బాబు ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. సోమవారం కలశ ఉద్వాసన, ఉత్సవ విగ్రహ ఉద్వాసన, సాయంత్రం మహా శోభాయాత్ర ప్రారంభమవుతుందని స్వామివారి నిమజ్జనోత్సవంతో ఉత్సవాల సమాప్తి జరుగుతుందని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

సర్పంచ్ పదవిపై నజర్!

- అధికార పార్టీ నుంచి పోటీపడుతున్న నాయకులు
- ఇప్పటి నుంచే గ్రామాల్లో కార్యక్రమాలు
- సోషల్ మీడియా వేదికగా మెసేజ్‌లు
- యువతను ఆకర్షించేలా తాయిలాలు
- చిన్న సంఘటన జరిగినా ప్రత్యక్షం

'ఏం రా చిన్నా.. ఏం చేస్తున్నారు. ఈ ఏడాది మన ఊర్లో ఎన్ని చోట్ల వినాయకుడి విగ్రహాలు పెడుతున్నారు. మనవాళ్లు అయితే చెప్పు మనమే విగ్రహాలు కొనిద్దాం. మన కాలనీలో అన్నదానం కూడా పెట్టిద్దాం.అంతా నువ్వే చూసుకోవాలి. నీ వెంట ఎంతమంది ఉన్నారో తెచ్చుకో.. మంచి పార్టీ చేసుకుందురు.. ఇదిగో ఈ రూ.రెండు వేలు ఉంచు. ఒకే అన్న నాలుగుచోట్ల విగ్రహాలు పెడుతున్నారు. మా బజార్‌లో పెట్టే విగ్రహం మాత్రం పెద్దగా ఉండాలి. అన్నదానం కూడా పెట్టాలి. మీరు రావాలి.. సరే కానీ ఎన్నడూ లేనిది వినాయక విగ్రహాలు, అన్నదానం అంటున్నావు ఎందన్నా. ఏం లేదురా.. ఈసారి సర్పంచ్‌గా నిలబడుదామని.. అన్ని పనులు చేస్తేనే కదా మనకు ఓట్లు వేసేది. ఖర్చు సంగతి నాకు విడిచిపెట్టి.. ఓట్ల సంగతి నువ్వు.. నీ ఫ్రెండ్స్ చూసుకోవాలి సుమా.'

ఇది జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామానికి చెందిన యువకుడికి, సర్పంచ్ పదవికోసం పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న నాయకుడికి మధ్య జరిగిన సంభాషణ.

సాక్షి, మహబూబాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచ్ ఎన్నికలకోసం ఓటరు జాబితా సిద్ధం చేస్తుండగా.. బరిలో నిలిచేందుకు నాయకులు సన్నాహాలు చేసుకుంటున్నారు. గతంలో గ్రామాల్లో ఏం జరిగినా పట్టించుకోని నాయకులు ఇప్పుడు ఏదైనా సంఘటన జరిగితే అక్కడ ప్రత్యక్షమవుతున్నారు. గ్రామానికి ముఖ్య నాయకులు వచ్చినప్పుడు అంతా తానై నడిపించినట్లు వ్యవహరిస్తున్నారు. అనుచరులతో హల్‌చల్ చేసి నాయకుల దృష్టిలో పడేలా ప్రయత్నిస్తున్నారు.

వినాయక పండుగకు ఖర్చులు..

గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఇప్పించడం, అన్నదానాలకు డబ్బులు ఖర్చు పెట్టడం, ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి నాయకులను పిలిచి సన్మానాలు చేయడం వంటి పనుల్లో ఆశావహులు నిమగ్నమయ్యారు. ఇప్పుడే ఇలా ఉంటే బతుకమ్మ, దసరా పండుగల సమయంలో మహిళలకు ఏం తాయిలాలు ఇస్తారో.. యువతను తమ వైపు తిప్పుకునేందుకు పండగలను ఎలా వాడుకుంటారో చూడాలి. ఏదీ ఏమైనా పోటీలో నిలబడేందుకు సిద్ధమైన వారు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొనే అవకాశం ఉంది.



సోషల్ మీడియాలో హల్‌చల్..

గ్రామానికి సర్పంచ్ కావాలనే ఆలోచన ఉన్నవారు సోషల్ మీడియాను ఆయుధంగా వాడుకుంటున్నారు. గ్రామ, వార్డు గ్రూపులు క్రియేట్ చేసి మెసేజ్‌లు పంపిస్తున్నారు. గ్రామానికి ఇది ఉంటే బాగుండు.. అది ఉంటే బాగుండు.. గ్రామం గతంలో ఇలా ఉండేది.. ఇప్పుడు ఇలా తయారైందని.. అనుచరులతో గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టిస్తూ.. లైక్‌లు, కామెంట్లు ఎన్ని వస్తున్నాయో లెక్కిస్తున్నారు. అదేవిధంగా గ్రామానికి ఈ సారి ఇటువంటి నాయకుడు కావాలని ఒకరు పోస్టు పెడితే.. కాదు కాదు ఇలా ఉండే నాయకుడు కావాలని మరొకరు పోస్టులు పెట్టి వాట్సాప్ వేదికగా గొడవలకు దిగిన సంఘటనలు ఉన్నాయి. కేసముద్రం మండలం బిచ్చు తండాలో డబ్బులు, మద్యం పోసిన వారికి ఓట్లు వేయవద్దని, ఓట్లకోసం మద్యం, డబ్బులు ఇవ్వొద్దని ఫ్లెక్సీ కట్టడం గమనార్హం.

నాయకులకు తలనొప్పి..

ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో సర్పంచ్ పదవిని ఆశించే వారు ఉండడంతో అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు తలనొప్పిగా మారింది. ఒకరిమీద ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం, పదే పదే వచ్చి నాయకులను కలిసి తనను దృష్టిలో ఉంచుకోవాలని గుర్తు చేయడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల సమీపించే కొద్ది పైరవీలు, గ్రామాల్లో పోటాపోటీ ప్రచారాలు ఎక్కువయ్యే అవకాశం ఉంది.

'అతిథి'.. అయోమయం!

- దయనీయంగా గెస్ట్ ఫ్యాకల్టీ పరిస్థితి
- రెన్యువల్ కోసం ఎదురుచూపులు

తొర్రూరు: అతిథి అధ్యాపకులు తమ ఉద్యోగాలను పునరుద్ధరిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. జూన్ 1నుంచి ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమైనా ఇప్పటి వరకు రెన్యువల్ చేయకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అతిథి అధ్యాపకులు మినహా కాంట్రాక్టు, ఎంటీఎస్ అధ్యాపకులను రెన్యువల్ చేశారు. కాగా గెస్ట్ లెక్చరర్లకు రెన్యువల్ లేకపోవడంతో వారు వేరే పనులు చేయలేక అవస్థలు పడుతున్నారు. తమ గోడు పట్టించుకుని రెన్యువల్ పత్రాలు అందించాలని కోరుతూ అతిథి అధ్యాపకులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కాగా గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయకపోవడంతో సిలబస్ పూర్తికాక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 10ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు గాను 19మంది అతిథి అధ్యాపకులు ఉన్నారు. వీరిని త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో పీజీలో మెరిట్ ఆధారంగా డెమో, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేశారు. వీరికి పిరియడ్‌కు రూ.390 చొప్పున నెలకు రూ.28,080 చెల్లించేవారు. ఎలాంటి సెలవులు వర్తించవు. దసరా, సంక్రాంతి సమయంలో సెలవులు వస్తే వారికి ఆ నెల వేతనం రూ.10 వేలు కూడా వచ్చేది కాదు. ఇదే కాకుండా కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడానికి శాశ్వత, కాంట్రాక్టు అధ్యాపకులతో సమానంగా ప్రచారం చేస్తూ ప్రవేశాల కోసం అతిథి అధ్యాపకులు సైతం కీలక పాత్ర పోషించారు.



తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పాఠాలు బోధిస్తున్న అతిథి అధ్యాపకుడు(ఫైల్)

వ్యవస్థ మొదలైంది ఇలా..

2011లో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసిన అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఆ తర్వాత 2013లో ఇంటర్మీడియట్‌లో ఉన్న పార్ట్‌టైం అవర్లీ బేస్డ్ లెక్చరర్స్ అనే వ్యవస్థకు పేరు మార్చి అతిథి అధ్యాపకులు అనే కొత్త వ్యవస్థను సృష్టించింది. వీరికి 2016 వరకు నెలకు 72 పీరియడ్‌లు మించకుండా పీరియడ్‌కు రూ.150 చొప్పున నెలకు రూ.10,800 చెల్లించేవారు. ప్రస్తుతం వీరి జీతం నెలకు 72 పీరియడ్‌లు మించకుండా పీరియడ్‌కు రూ.390 చొప్పున రూ.28,080 చెల్లిస్తున్నారు. కాగా 2018వ సంవత్సరంలో రెన్యువల్ సమస్యగా మారడంతో అతిథి అధ్యాపకులు కోర్టుకు వెళ్లారు. పాత వారినే తిరిగి రెన్యువల్ చేయాలని చెప్పడంతో వారినే కొనసాగించారు. ఈ సారి రెన్యువల్ చేయకపోవడం, పీజీలో మెరిట్ ఆధారంగా కొత్తవారిని తీసుకోవచ్చనే నిబంధనతో పదేళ్లుగా ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న అతిథి అధ్యాపకుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారనున్నాయి. గత విద్యా సంవత్సరంలో నాలుగు నెలల వేతనాలు నేటికీ అందలేదు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు తిరిగి పాత వారినే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇతర అధ్యాపకులతో పాటు విధులు..

పేరుకే అతిథి అధ్యాపకులు.. మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్), కాంట్రాక్టు అధ్యాపకులతో పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. పాఠాలు బోధించడమే కాకుండా ప్రతి గ్రామానికి వెళ్లి అక్కడ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి వివరించి ప్రవేశాలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. సకాలంలో వేతనాలు అందకపోయినప్పటికీ సొంత డబ్బులు ఖర్చు చేస్తూ గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో చేరేలా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంత చేసినా రెన్యువల్ చేయకపోవడం, పీజీలో మెరిట్ ఆధారంగా కొత్తవారిని తీసుకోవచ్చనే నిబంధనలు పెట్టడంతో కొన్నేళ్లుగా అదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న అతిథి అధ్యాపకులు రోడ్డున పడే అవకాశం ఉంది.

పునరుద్ధరించాలి



పదేళ్లుగా గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్న వారికి రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వలేదు. అతిథి అధ్యాపకుల పునరుద్ధరణ లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే వృత్తిని నమ్ముకున్న వారు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పునరుద్ధరణ ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలి.

-గద్దం రాజశేఖర్, గెస్ట్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

పాతవారినే కొనసాగించాలి



ఆరేళ్లుగా గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నా. విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రతీ గ్రామంలో తిరిగి ప్రభుత్వ కళాశాలలో కల్పించే సౌకర్యాల గురించి వివరిస్తున్నా. మెరుగైన ఫలితాల సాధనకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. రెన్యువల్ చేయకపోవడంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నాం. పాతవారిని రెన్యువల్ చేయడంతో పాటు కొత్త పోస్టుల స్థానంలో నూతన విద్యా విధానం మేరకు ఖాళీలను భర్తీ చేయాలి.

-మేరుగు చంద్రశేఖర్, గెస్ట్ ఫ్యాకల్టీ

ఎలాంటి ఆదేశాలు రాలేదు

గెస్ట్ ఫ్యాకల్టీ రెన్యువల్‌కు సంబంధించిన అంశంపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రతీ ఏడాది జూన్‌లో నియామకం జరిగి ఫిబ్రవరి వరకు ఒప్పందం ప్రకారం పిరియడ్‌కు రూ.390 చొప్పున గెస్ట్ ఫ్యాకల్టీలకు వేతనాల చెల్లింపులు జరిగేవి. గెస్ట్ ఫ్యాకల్టీ అంశంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుస్తాం.

-మదార్, జిల్లా ఇంటర్ విద్యాధికారి

సీతారాంతండా సందర్శన

మరిపెడ రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన మరిపెడ మండలం సీతారాంతండను రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సెక్రటరీ గుగులోతు రవినాయక్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు బాధితుల గృహాలను సందర్శించి వారిని పరామర్శించారు. అనంతరం రవి నాయక్ మాట్లాడుతూ.. బాధితులు ఎవరు కూడా అధైర్యపడొద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ముందుగా బాధితులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 50 బాధిత కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, రిటైర్డ్ అధికారి కోబాస్‌సింగ్, మాజీ సర్పంచ్ గుగులోతు లక్ష్మిలక్‌పతి, రిటైర్డ్ టీచర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



తండావాసులతో మాట్లాడుతున్న రవినాయక్

లడ్డూ @ రూ.4.51లక్షలు



శిరీషను సన్మానిస్తున్న నిర్వాహకులు

కేసముద్రం: మండల కేంద్రంలోని ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం వద్ద ఆదివారం రాత్రి లడ్డూ వేలం పాట పాడారు. కాగా, గ్రామానికి చెందిన కల్లెపల్లి శిరీష అనే భక్తురాలు రూ.4,51,116కు లడ్డూను దక్కించుకున్నారు. ఈమేరకు ఆమెను ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులు

నెహ్రూసెంటర్: భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన సమైక్య పోరాటమే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని, ఆ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఐదేళ్ల రైతాంగ సాయుధ పోరాటం సాగిందని వివరించారు. ప్రపంచ చరిత్రలో రైతాంగ సాయుధ పోరాటం సువర్ణ అక్షరాలతో లిఖించదగినదని పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే వేల ఎకరాల సాగు భూములు, ఇళ్ల స్థలాలు పేదలకు దక్కాయన్నారు. రాష్ట్రంలో దళిత, గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పథకం కింద రూ. 6లక్షలు, బీసీలకు రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో భూపోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నాయకులు గునిగంటి రాజన్న, సమ్మెట రాజమౌళి, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, రావుల రాజు, తోట శ్రీను, నక్క సైదులు, కందునూరి శ్రీను, హేమానాయక్, నాగన్న, బానోత్ వెంకన్న, ఎర్ర శ్రీను పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జి.నాగయ్య

రేపు వరంగల్ మార్కెట్ పునఃప్రారంభం

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ 17వ తేదీన (మంగళవారం) పునః ప్రారంభమవుతుందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ (శనివారం), 15వ తేదీ (ఆదివారం), 16వ తేదీన, (సోమవారం, వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా) ప్రభుత్వం సెలవు ప్రకటించిందన్నా రు. 17వ తేదీన (రేపు) మార్కెట్ పునః ప్రారంభమవుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, గుమస్తాలు గమనించాలని కోరారు.

ఇద్దరిపై కేసు నమోదు

శాయంపేట : ఎస్సీ, ఎస్టీ కమిషన్ కమిషన్ ఆదేశాల మేరకు ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన దైనంపల్లి మల్లికార్జున్ 2021లో అదే గ్రామానికి చెందిన రైతు వంగ కొమురయ్య వద్ద 22 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. 2021 జనవరి 22న హద్దులు కూడా నాటించి ఇచ్చాడు. అదే రోజు అదే గ్రామానికి చెందిన పక్క రైతులైన చల్లా సాంబరెడ్డి, చల్లా భాస్కర్ రెడ్డి.. ఇక్కడ నీకు భూమి ఎక్కడిది రెడ్డి వాళ్ల మధ్యలో భూములు కొంటావా.. అని కులం పేరుతో దూషించి కొమురయ్య నాటిన హద్దులను తొలగించారు. ఈ ఘటనపై బాధితుడు మల్లికార్జున్ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను సంప్రదించాడు. కమిషన్ ఆదేశాల మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

జ్వరంతో వస్తే వెళ్లగొట్టారు..

- వైద్య సిబ్బందిపై కుటుంబ సభ్యుల ఆగ్రహం



వివరాలు తెలుపుతున్న బాధితులు

స్టేషన్‌ఘన్‌పూర్: తీవ్ర జ్వరంతో ఉన్న బాలికను ప్రభుత్వాసుపత్రికి తీసుకువస్తే వైద్య సిబ్బంది వెళ్లగొట్టిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగింది. బాధిత బాలిక తండ్రి ఇల్లందుల కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాఘవాపూర్‌కు చెందిన ఇల్లందుల కుమార్ అతడి కుమార్తె కృషిప్రభకు తీవ్ర జ్వరంగా ఉంటే ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇప్పుడు చూసేది లేదంటూ గేటు నుంచే సెక్యూరిటీ వారు, వైద్య సిబ్బంది వెళ్లగొట్టారు. చేసేదే లేక వెళ్లిపోయి ఉదయం 10 గంటల తర్వాత వచ్చారు. డ్యూటీ డాక్టర్ సౌఖ్య బాలికను పరిశీలించి ఆదివారం సెలవు కావడంతో ఆస్పత్రిలో ల్యాబ్ బంద్ ఉందని, రక్త పరీక్షలు చేయించుకుని వస్తే వైద్యం చేస్తానని చెప్పింది. అమ్మాయి నీరసంగా ఉంది.. ముందు అడ్మిట్ చేసుకోమని కోరగా రక్త పరీక్ష రిపోర్టు వచ్చాకే అడ్మిట్ చేసుకుంటామనడంతో బాలిక కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది కల్పించుకోవడంతో వాదనలు జరిగాయి. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ రాజమౌళి, పోలీసు సిబ్బంది చేరుకుని డాక్టర్‌కు, రోగి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. అనంతరం బాలికను ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకోగా.. ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్ వచ్చి రక్తనమూనా తీసుకెళ్లాడు. ఈ విషయమై డాక్టర్ సౌఖ్యను వివరణ కోరగా.. 'జ్వరంతో రోగి రాత్రి 2 గంటలకు వచ్చిన విషయం నాకు తెలియదు.. రాత్రి డ్యూటీ డాక్టర్‌గా ఆస్పత్రిలో ఉన్నా. వారు గేటు వద్ద నుంచే వెళ్లినట్లు తెలిసింది. ఉదయం వస్తే జ్వరం చూసి మందులు రాసిచ్చా. ఎలాంటి జ్వరమో తెలుసుకునేందుకు రక్త పరీక్షలు చేయించమని చెప్పా. రిపోర్టుల ద్వారా సరైన వైద్యం చేసే అవకాశం ఉంటుంది. నిబంధనల మేరకు పనిచేస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు.

మల్బరీ సాగుకు ప్రోత్సాహం

- సాగు చేసే రైతుల కోసం 'సిల్క్ సమగ్ర పథకం'
- పట్టు పరిశ్రమ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం



మల్బరీ తోట



సిద్ధమైన పట్టు గూళ్లు

దోర్నకల్: మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణ కోసం ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ప్రోత్సాహకాలు ప్రకటించింది. రెండేళ్ల క్రితం పట్టుగూళ్ల ధర కిలో రూ.400 ఉండగా గతేడాది రూ.600కు పెరిగింది. ప్రస్తుతం పట్టుగూళ్లకు మరింత డిమాండ్ పెరిగింది. తద్వారా జనగామ, హైదరాబాద్ మార్కెట్‌లో పట్టుగూల్లకు భారీ డిమాండ్ ఉంది. పట్టుగూళ్ల ద్వారా అధిక ఆదాయం ఇచ్చే మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిల్క్ సమగ్ర పథకాన్ని అమలు చేస్తోంది. ఇతర వాణిజ్య పంటల కన్నా మల్బరీ, పట్టు పరిశ్రమ నిర్వహణతో అధిక లాభాలు వస్తున్నాయి. దీంతో మల్బరీ, పట్టు పరిశ్రమ నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమానికి పట్టు పరిశ్రమ శాఖ శ్రీకారం చుట్టింది. సిల్క్ సమగ్ర పథకం కింద అమలు చేసే ఈ పథకానికి ఎస్సీ, ఎస్టీ, జనరల్ రైతులకు రాయితీలను వేర్వేరుగా ప్రకటించింది.

మల్బరీ సాగుకు సానుకూల అంశాలు

అతి తక్కువ నీటి వినియోగం అవసరం కాగా మొక్కలను ఒకసారి నాటితే 10నుంచి 15ఏళ్ల వరకు దిగుబడినిస్తాయి. నల్లరేగడి, చౌడు మినహా అన్నిరకాల నేలలు మల్బరీ సాగుకు అనుకూలం. క్రిమిసంహారక మందుల అవసరం ఉండదు. మొదటి సంవత్సరం 3 పంటలు, రెండో సంవత్సరం నుంచి 6నుంచి 7పంటల దిగుబడి ఉంటుంది.

సిల్క్ సమగ్ర పథకం ద్వారా రైతులకు రాయితీలు

వివరాలు	జనరల్	ఎస్సీ/ఎస్టీ
రెండు ఎకరాల్లో మల్బరీ సాగు	రూ.60,000	రూ.78,000
నీటి నదుపాయానికి	రూ.50,000	రూ.65,000
పట్టు రేరింగ్ షెడ్ నిర్మాణం	రూ.2,25,000	రూ.2,95,000
పరికరాలకు	రూ.37,500	రూ.48,750
రోగ నిరోధక మందులకు	రూ.2,500	రూ.3,250
కిసాన్ నర్సరీ (యూనిట్‌కు రూ.1.5లక్షలు)	రూ.75,000	రూ.97,500

ప్రభుత్వం నుంచి రాయితీలు



పట్టు పరిశ్రమను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతుల కోసం ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. పట్టు పరిశ్రమ ద్వారా వాణిజ్య పంటల కంటే అధిక ఆదాయం పొందొచ్చు. మల్బరీసాగు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు సంబంధిత జిల్లాల పట్టుపరిశ్రమ అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- జి.అనసూయ, సంయుక్త సంచాలకురాలు, పట్టుపరిశ్రమశాఖ, హనుమకొండ

నేడు ట్రైసిటీలో ట్రాఫిక్ ఆంక్షలు

- మధ్యాహ్నం 12 నుంచి మంగళవారం ఉదయం 10 గంటల వరకు..
- వినాయక నిమజ్జన నేపథ్యంలో నిర్ణయం
- సీపీ అంబర్ కిషోర్‌ఝా వెల్లడి



వరంగల్ క్రైం: వినాయక నిమజ్జనం నేపథ్యంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రై సిటీ పరిధిలో సోమవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీపీ అంబర్ కిషోర్‌ఝా పేర్కొన్నారు. నగరంలో శోభాయాత్రలు, నిమజ్జనానికి వినాయక విగ్రహాలను తరలించే మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు ఈనెల 16న మధ్యాహ్నం 12 నుంచి 17వ తేదీ ఉదయం 10 గంటల వరకు అమలులో ఉంటాయని వివరించారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

- ములుగు, భూపాలపల్లి వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే భారీ వాహనాలు ఆరెపల్లి ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి ప్రయాణించాలి. భూపాలపల్లి, పరకాల నుంచి ఖమ్మం వెళ్లాల్సిన వాహనాలు ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి కరుణాపురం, మడికొండ, కడిపికొండ, నాయుడు పెట్రోల్ పంపు మీదుగా పోవాలి.
- భూపాలపల్లి, పరకాల నుంచి నర్సంపేట వైపు వెళ్లాల్సిన భారీ వాహనాలు కొత్తపేట, రెడ్డిపాలెం, జానీపీరీలు, గొర్రెకుంట నుంచి వెళ్లాలి.
- సిటీ లోపలికి వచ్చే భారీ వాహనాలు సిటీ అవతలే నిలిపివేయాలి. నిమజ్జన సమయంలో లోపలికి అనుమతి లేదు.

నగరంలోకి వచ్చి, వెళ్లే ఆర్టీసీ బస్సులకు..

- ములుగు, పరకాల వైపు నుంచి వచ్చే బస్సులు వయా పెద్దమ్మగడ్డ నుంచి కేయూసీ, సీపీఓ జంక్షన్ మీదుగా అంబేడ్కర్ సెంటర్, ఏషియన్ శ్రీదేవిమాల్ నుంచి బస్టాండుకు చేరుకోవాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి బయలుదేరి ములుగు, కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు వయా ఏషియన్ శ్రీదేవిమాల్, అంబేడ్కర్ సెంటర్, సీపీఓ జంక్షన్ మీదుగా కేయూసీ జంక్షన్ నుంచి వెళ్లాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి నర్సంపేట, కొత్తగూడెం, భద్రాచలం, తొర్రూరు, ఖమ్మం వైపు వెళ్లే బస్సులు వయా బాలసముద్రం, అదాలత్, హంటర్‌రోడ్ మీదుగా వెళ్లాలి.
- వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండ వైపు వచ్చే బస్సులు చింతల్ బ్రిడ్జి నుంచి రంగశాయిపేట్ మీదుగా నాయుడు పెట్రోల్ పంప్ సెంటర్, ఉర్సుగుట్ట, అదాలత్, బాలసముద్రం రోడ్ మీదుగా హనుమకొండకు చేరుకోవాలి.

నిమజ్జన వాహనాలకు..

- సిద్ధేశ్వర గుండంలో నిమజ్జనం చేయడానికి 6 అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాలు.. ట్రాక్టర్, టాటా ఏస్ వాహనాల్లో వచ్చే వాటిని మాత్రమే అనుమతిస్తారు. శోభాయాత్ర హంటర్ రోడ్, అదాలత్, సీపీఓ జంక్షన్, హనుమకొండ చౌరస్తా, బాలాంజనేయ స్వామి టెంపుల్ మీదుగా వెళ్లి నిమజ్జనం అనంతరం వయా శాయంపేట మీదుగా తిరిగి రావాలి.
- హనుమకొండకు చెందిన భారీ వినాయక విగ్రహాలను చిన్న వడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేయాలి.
- ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, వడ్డేపల్లి ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలను బంధం చెరువులో నిమజ్జనం చేయాలి.
- చిన్నవడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేసే విగ్రహాలను కాశిబుగ్గ, పోచమ్మమైదాన్, దేశాయిపేట మీదుగా తీసుకెళ్లాలి. అనంతరం వయా ఏనుమాముల మార్కెట్ నుంచి కాశిబుగ్గ మీదుగా తిరిగి వెళ్లాల్సి ఉంటుంది.

కాకతీయ కాల్వకు బుంగలు

- టెక్స్‌టైల్ పార్కుకు పొంచి ఉన్న ప్రమాదం
- తెగిపోతే కైటెక్స్ పరిశ్రమకు భారీ నష్టం..!



రెయిలింగ్ దెబ్బతిన్న కాకతీయ ప్రధాన కాల్వ

సంగెం: ఆసియాలోనే అతిపెద్దదైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కాకతీయ కాల్వ వల్ల ప్రమాదం పొంచి ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో కోట్లాది రూపాయల ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంగెం-గీసుకొండ మండలాల పరిధిలో ఏర్పాటవుతున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో కంపెనీల నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నది. ఎస్సారెస్పీ నుంచి మహబూబాబాద్ జిల్లాకు నీరందించే ప్రధాన కాకతీయ కెనాల్‌కు సంగెం మండలంలోని వెంకటాపూర్-కుంటపల్లి గ్రామాల మధ్య బుంగలు పడ్డాయి. అనేక చోట్ల రెయిలింగ్ దెబ్బతిన్నది. భారీగా బుంగలు పడిన ప్రాంతంలో కాల్వ కిందివైపున రెండు వందల మీటర్ల దూరంలో అతిపెద్ద వస్త్ర పరిశ్రమ కైటెక్స్ నిర్మాణం జరుగుతున్నది. భారీగా నీరు వదిలితే బుంగలు పడినచోట కోతకు గురై కాల్వకు గండిపడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మొదట కైటెక్స్, గణేశ్, యంగ్‌వన్ తదితర కంపెనీల్లోని ఖరీదైన యంత్రాలు దెబ్బతింటాయి. అదేవిధంగా వరదతో రోడ్లు దెబ్బతినడంతోపాటు వరంగల్-విజయవాడ రైల్వే లైన్ దెబ్బతినే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కాల్వకు బుంగలు పడ్డాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న కాల్వ రెయిలింగ్‌తోపాటు బుంగలను పూడ్చి వేసి ప్రమాదాలు జరుగకుండా అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.

నేడు కాజీపేటలో 'వందేభారత్' ప్రారంభం

- పాల్గొననున్న ఎంపీలు, మంత్రులు, అధికారులు



వందేభారత్ ఎక్స్‌ప్రెస్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో సోమవారం రాత్రి నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. నాగ్‌పూర్ -సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌లో ప్రారంభిస్తుండగా కాజీపేట జంక్షన్‌లో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీలు, మంత్రులు, రైల్వే అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ వివరాలు..

నాగ్‌పూర్-సికింద్రాబాద్ (20101) ఎక్స్‌ప్రెస్ ఆదివారం నాగ్‌పూర్‌లో సాయంత్రం 16.15 గంటలకు బయలుదేరి సేవాగ్రామ్‌కు 17.00 గంటలకు, చంద్రాపూర్‌కు 18.20 గంటలకు, బల్లార్షాకు 18.40 గంటలకు, రామగుండానికి 20.20 గంటలకు, కాజీపేట జంక్షన్‌కు రాత్రి 21.25 గంటలకు చేరుకుని సికింద్రాబాద్‌కు 23.25 గంటలకు చేరుతుంది.

రైలు హైలెట్స్

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 20 కోచ్‌లు ఉంటాయి. వీటిలో 2 ఎగ్జిక్యూటివ్ క్లాసెస్ కోచ్‌లు, 18 చైర్ కార్ కోచ్‌లు ఫుల్లీ ఏయిర్ కండిషన్డ్ విత్ కంబైన్డ్ సిట్టింగ్ కెపాసిటీ ఆఫ్ 1440 సీట్లు ఉన్నాయి. నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య 7 గంటల 15 నిమిషాల ప్రయాణ దూరం. గంటకు 160 కి.మీ.వేగంతో ప్రయాణం. వైఫై సమాచారం. జీపీఎస్ బేస్డ్ ప్యాసింజర్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్. టచ్ బయో వాక్యూమ్ టాయ్‌లెట్స్, ఎల్ఈడీ లైటింగ్, చార్జింగ్ పాయింట్స్ సీట్స్, ఇండివిజల్ టచ్ బేస్డ్ రీడింగ్ లైట్స్, హీట్ వెంటిలేషన్ అండ్ ఏయిర్ కండిషనింగ్ సిస్టిమ్ విత్ యు.వి.లాంప్, సేఫ్టీ ఫీచర్స్, కవాచీ టెక్నాలజీ అడెడ్ ఫీచర్ సిస్టమ్ ఉంటుంది.

టికెట్ ధరలు..

కాజీపేట-నాగ్‌పూర్‌కు చైర్‌కార్ టికెట్ రూ.1280, ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ రూ.2325, నాగ్‌పూర్-సికింద్రాబాద్ చైర్‌కార్ టికెట్ రూ.1350, ఎగ్జిక్యూటివ్ క్లాస్ రూ.2605 ఉంది.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మహిళ

చిన్నగూడూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓ మహిళ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మానుకోట జిల్లా చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన గంగరబోయిన వెంకన్న, హైమ దంపతులు తెలిపిన వివరాల ప్రకారం .. అదే గ్రామానికి చెందిన గంగరబోయిన వీరన్న వద్ద వారు ఎకరం పొలం రూ.16లక్షలకు కొనుగోలు బేరం కుదుర్చుకున్నాడు. ముందుగా కొంత నగదును చెల్లించారు. మిగిలిన నగదును వాయిదాల ప్రకారం చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత వీరన్న మొత్తం నగదును చెల్లించాలని ఒత్తిడి చేయడంతో ఒప్పందం ప్రకారం చెల్లిస్తామని చెప్పినా వినకుండా మానసికంగా వేధించసాగాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పటికీ తమకు న్యాయం జరగలేదని బాధితులు పేర్కొన్నారు. ఒక్కసారిగా అంత డబ్బు చెల్లించలేమని మనస్తాపానికి గురైన బాధిత మహిళ హైమ స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

కాజీపేట: కాజీపేట రైల్వే ఆస్పత్రి దారిలో గంజాయిని విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని 860 గ్రాముల శుద్ధి చేసిన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. కాజీపేట పట్టణానికి చెందిన యువకుడు గొర్రె ప్రశాంత్ ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో విశాఖపట్నం వెళ్లి గంజాయి కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నాడు. ఎస్సై నవీన్‌కుమార్ పెట్రోలింగ్ చేస్తుండగా పారిపోతున్న ప్రశాంత్‌ను ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించిందన్నారు. పంచుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి వివరించారు.

బాధితురాలికి న్యాయం చేయాలి

- పీఎస్ ఎదుట గ్రామస్తుల ధర్నా
- ఘటనాస్థలికి చేరుకున్న డీఎస్పీ రవీందర్
- పోలీసు అధికారుల హామీతో ఆందోళన విరమణ



పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(ఎం): ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వెంకటాపురం(ఎం) పీఎస్ ఎదుట గంటకుపైగా ధర్నా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. పీఎస్ పరిధిలోని భూపాలపల్లి మండలం పెరకపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళపై ఈనెల 11వ తేదీన అదే గ్రామానికి చెందిన మాదం శివకుమార్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈఘటనపై 12వ తేదీన శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలితోపాటు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజులు దాటినా పోలీసులు పట్టించుకోకపోవడంతో ఆదివారం ఎస్పీ శబరీష్‌ను కలిసేందుకు వెళ్తున్న సుమారు 200 మంది గ్రామస్తులను పోలీసులు మండల కేంద్రంలోని తాళ్లపాడు వద్ద అడ్డగించారు. దీంతో ఆగ్రహం చెందిన గ్రామస్తులు పీఎస్ ఎదుట ధర్నా నిర్వహించారు. నిందితుడు గ్రామంలో తిరుగుతూ ఎవరైనా సాక్ష్యం చెబితే చంపేస్తానంటూ భయభ్రాంతులకు గురిచేస్తుంటే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ ఆందోళన ఉధృతం చేశారు. ఎస్సై సతీశ్ మాట్లాడినా గ్రామస్తులు శాంతించలేదు. దీంతో ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్ ఘటనాస్థలికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. బాధితురాలు, కుటుంబసభ్యులు, పెద్ద మనుషులను పోలీస్‌స్టేషన్‌లోకి పిలిపించి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. సుమారు గంటకు పైగా ధర్నా నిర్వహించడంతో రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబసభ్యులు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 11వతేదీన మహిళపై లైంగికదాడి జరిగితే జరిగితే పోలీసులు ఇప్పటివరకు న్యాయం చేయలేదన్నారు. డయల్ 100 నంబర్‌కు కాల్ చేస్తే ఎస్సై తమకు ఫోన్ చేసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. లైంగికదాడి జరిగినట్లు మీరు ఎలా చెబుతారని నిందితుడు ఏదైనా సేఫ్టీ వాడొచ్చు కాదా అని ఎస్సై దుర్భాలాషలాడని బాధితురాలి కుమారుడు విలేకరులకు వెల్లడించారు. న్యాయం కోసం ఎస్పీ దగ్గరకు వెళ్తుంటే ఎస్సై సతీశ్, సిబ్బంది అడ్డగించి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై ములుగు సీఐ శంకర్‌ను వివరణ కోరగా ఈనెల 12న కుటుంబీకులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశామన్నారు. వారు రోజుకు ఒక విధంగా ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. నిందితుడిని 48 గంటల్లోగా అరెస్ట్ చేస్తామని వెల్లడించారు.

బతుకుభారమై.. బలవన్మరణం

వేర్వేరు కారణాలతో బతుకుభారమై ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



వెంకన్న (ఫైల్)

నెక్కొండ: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని అలంకానిపేటలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పోరండ్ల వెంకన్న (53) తన పెద్ద కుమార్తె వివాహం చేశారు. ఇందుకు కొంత అప్పు చేశాడు. అలాగే, రెండో కుమార్తె వివాహం చేయాల్సి ఉండగా ఆర్థిక పరిస్థితులు బాగోలేవు. దీంతో కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో భార్య లక్ష్మి కూలీ పనులకు వెళ్లగా ఈ నెల 14వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లక్ష్మి ఇంటికి వచ్చి చూడగా వెంకన్న మృతి చెంది కనిపించాడు. ఈఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ ఆదివారం పేర్కొన్నారు.

ఇంటికన్నెలో రైల్వే ఉద్యోగి..

కేసముద్రం: గుండెజబ్బుతోపాటు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందుతున్న ఓ రైల్వే ఉద్యోగి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఇంటికన్నెలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి కడబోయిన విజయ్‌కుమార్(35) కొంతకాలంగా గుండెజబ్బు, ఆర్థిక ఇబ్బందుల కారణాలతో మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన విజయ్‌కుమార్.. ఈనెల 12న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య మణెమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మంగోరిగూడెంలో మహిళ..

చిన్నగూడూరు: అనారోగ్యంతో మహిళ ఉరేసుకుని మృతి చెందిన ఘటన మానుకోట జిల్లా చిన్నగూడూరు మండలంలోని మంగోరిగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... మంగోరిగూడెం గ్రామానికి చెందిన డెంకన పద్మ(46) కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతుంది. జ్వరంతోపాటు ఒంటి నొప్పులు ఉండడంతో మనస్తాపానికి గురై ఆదివారం ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మనస్తాపంతో కాటారంలో వ్యక్తి..

కాటారం : భార్య మృతి చెందడంతోపాటు తాను జైలు పాలయ్యాననే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాటారం మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం భూపాలపల్లి మండలం వేశాలపల్లికి చెందిన ఎలకంటి రమణాచారి(40) గతేడాది ఏప్రిల్‌లో కుటుంబ కలహాలతో తన భార్య రమను హత్య చేశాడు. హత్య కేసులో సుమారు పది నెలలపాటు జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చాడు. నాలుగు నెలల నుంచి కాటారం మండల కేంద్రంలోని మెగా కంపెనీకి చెందిన మెస్‌లో కుక్ హెల్పర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన భార్యను గుర్తు చేసుకుంటుండటంతో పాటు జైలుకు వెళ్లానని నిత్యం మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున మెస్ సమీపంలోని రేకులషెడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఆగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

మన్నెగూడెంలో అనుమానాస్పద స్థితిలో యువకుడు..

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడేనికి చెందిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పి.వినేశ్(23)కు గత ఏప్రిల్‌లో కాంపెల్లి మండలం బర్లగూడేనికి చెందిన కరుణశ్రీతో వివాహం జరిగింది. ఈ నెల 11న భార్యను బర్లగూడెంలో వదిలివచ్చాడు. తండ్రి బాలునాయక్ (పాస్టర్) షుగర్ వ్యాధితో బాధపడుతుండగా ఆయనను శనివారం ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించాడు. వినేశ్ తిరిగి మన్నెగూడెం చేరుకున్నాడు. ఆదివారం చర్చి తాళాల కోసం స్థానికులు వినేశ్ ఇంటికి వెళ్లగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని తండ్రి బాలునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి దుర్మరణం



శ్రవణ్‌కుమార్ (ఫైల్)

హసన్‌పర్తి : బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదం ఆరెపల్లి-వంగపహాడ్ మార్గమధ్యలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన దామెర శ్రవణ్‌కుమార్ (23) ప్లంబింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఉదయం పనికి వెళ్లిన శ్రవణ్ రాత్రి వరకూ ఇంటికి రాలేదు. ఈక్రమంలో ఆదివారం పొలాల్లో బైక్‌తో ఓ యువకుడు పడి ఉన్నట్లు గుర్తించిన కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి పరిశీలించగా అతడు మృతి చెంది ఉన్నాడు. ఆ యువకుడి వద్ద లభ్యమైన ఆధారాల మేరకు పెగడపల్లికివాసిగా గుర్తించారు. ఈమేరకు స్థానికంగా పంచమానా నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఎలిషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దాడిలో ఒకరి మృతి



మోరే భిక్షపతి (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: మతిస్థిమితం లేని వ్యకి దాడిలో ఒకరు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దామెరవాయి సమీపంలోని చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. దామెరవాయి గ్రామానికి చెందిన మోరే భిక్షపతి(48) ఆదివారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై కాటాపూర్ వస్తుండగా బెస్తగూడెం సమీపంలోని ఇటుక బట్టీల వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి బైక్‌పై వెళ్తున్న భిక్షపతిని కర్రతో కొట్టడంతో కిందపడిపోయాడు. అంతటితో ఆగకుండా కర్రతో తలపై కొట్టడంతో రక్తస్రావం జరిగి స్పృహ కోల్పోయాడు. తెలుసుకున్న గ్రామస్తులు భిక్షపతిని చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దాడికి కారకుడైన మతిస్థిమితం లేని వ్యక్తిని దామెరవాయి గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సదరు వ్యక్తి ఆరునెలల నుంచి ఇటుబట్టీల వద్ద తిరుగుతూ గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటన స్థలాన్ని పస్రా సీఐ రవీందర్ పరిశీలించారు. పోలీసులు మతిస్థిమితం లేని వ్యక్తి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

పెట్టుబడుల ముసుగులో మోసం..

- రాజస్తాన్‌కు చెందిన సైబర్ నిందితుడి అరెస్ట్

వరంగల్ క్రైం: దేశ వ్యాప్తంగా పెట్టుబడుల ముసుగుల్లో ప్రజలను నమ్మించి కోట్లలో సొమ్ము కాజేస్తున్న రాజస్తాన్‌కు చెందిన సైబర్ నేరస్తుడిని వరంగల్ సైబర్ క్రైం పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ తెలిపారు. ఏసీపీ విజయ్‌కుమార్ కథనం ప్రకారం..రాజస్తాన్‌లోని దేగానా పట్టణానికి చెందిన కాలురామ్.. కొద్ది రోజులుగా ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ రూపంలో ఎక్కువ మొత్తంలో డబ్బు పొందొచ్చని ప్రజలను మోసం చేస్తూ కోట్లు కొల్లగొడుతున్నాడు. దేశ వ్యాప్తంగా పన్నెండుకుపైగా నేరాలకు పాల్పడ్డాడు. తెలంగాణ రాష్ట్రంలో రెండు నేరాలకు పాల్పడ్డాడు. హనుమకొండ ప్రాంతానికి చెందిన ఓ ప్రముఖ వైద్యుడిని నమ్మించి అతడి ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 21 లక్షల పెట్టుబడి పెట్టించి మోసం చేశాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రత్యేక సైబర్ బృందం పోలీసులు ఈనెల 14న నిందితుడిని రాజస్తాన్‌లో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు చరణ్, శివకుమార్, ఏఏఓ సల్మాన్ పాషా,కానిస్టేబుళ్లు కిశోర్ కుమార్, ఆంజనేయులు, రాజును సీపీ అభినందించారు.